క్లుప్తంగా

వైద్య శిబిరం



దోమకొండ: లింగుపల్లిలో శుక్రవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆయుర్వేద క్యాంపు ఏర్పాటు చేశారు. ఆయుర్వేద డాక్టర్ వెంకటేశ్వర్లు పేషెంట్లను పరీక్షించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాయిలు, ఎంపీడీవో చిన్నారెడ్డి, విశ్వతేజ్ పామ్ ఆయిల్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణ, ఎస్ఎస్ఓ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ సౌజన్యంతో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు హరికిషన్ 65 మందికి కంటి పరీక్షలు చేశారు. 10 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరిని ఆపరేషన్ నిమిత్తం బోధన్ కంటి ఆసుపత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. శిబిరంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో..

మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్ద ఎక్లార గేటు వద్ద గల బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మద్నూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. కండ్ల కలత సోకిన వారికి కంటి డ్రాప్స్, కంటి అద్దాలను అందించారు. డాక్టర్ విక్రమ్ కుమార్ ఆర్థిక సహాయంతో మందులు అందించారు. రెడ్ క్రాస్ మండల చైర్మన్ ప్రకాష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపి క్యాంప్

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగ విద్యార్థుల కోసం ఎంఈవో దేవిసింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌లో ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి 10 మంది విద్యార్థులకు ఫిజియోథెరపి నిర్వహించారు. అనంతరం ఇంటి వద్ద చేయించే వ్యాయామాలపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు.

కబ్జా భూమిని కాపాడినందుకు కలెక్టర్‌కు సన్మానం



లింగంపేట(ఎల్లారెడ్డి): కొండాపూర్ గ్రామస్తులు శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకోవడంతో విషయాన్ని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆయన వెంటనే స్పందించి కబ్జాకు గురైన 27 గుంటల ప్రభుత్వ భూమిలో నిర్మాణాలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. దాంతో సర్పంచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో కామారెడ్డికి వెళ్లి కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.

వెంకటాపూర్‌లో గ్రామసభ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వెంకటాపూర్‌లో సర్పంచ్ గౌలపల్లి సురేఖ అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్ రూంలు మంజూరు కావడంతో వారికి ఇంటి నిర్మాణాలు చేసేలా తీర్మానం చేశారు. గ్రామంలో కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు.

'అవిశ్వాసం'పై హైకోర్టు స్టే

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి వైస్ ఎంపీపీ నర్సింలుపై ఈనెల 7న నిర్వహించాల్సిన అవిశ్వాస బల పరీక్ష సమావేశాన్ని హైకోర్టు ఆదేశాలతో రద్దు చేశారు. ఎల్లారెడ్డి వైస్ ఎంపీపీ నర్సింలుపై అవిశ్వాసం ప్రవేశపెడుతూ పలువురు ఎంపీటీసీలు గత నెల 11న ఆర్డీవోకు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో అవిశ్వాస బల పరీక్ష సమావేశం నిర్వహణపై వైస్ ఎంపీపీ నర్సింలు హైకోర్టును ఆశ్రయించారు. బల పరీక్ష సమావేశంపై హైకోర్టు స్టే విధించిందని ఎల్లారెడ్డి ఆర్డీవో రాథోడ్ రమేష్ తెలిపారు. హైకోర్టు నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చిన తరువాత సమావేశ తేదీని ప్రకటిస్తామని అన్నారు.

అంతర కృషి చేసుకోవాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): పంటలో అంతరకృషి చేసుకోవడం ద్వారా పంట పెరుగుదల బాగా ఉంటుందని ఏఈవో ప్రియాంక తెలిపారు. శుక్రవారం చిన్న తక్కడ్‌పల్లి గ్రామ శివారులో పత్తి పంటలను ఆమె పరిశీలించారు. సాగు సమయంలో మెలకువల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పంట చేలల్లో లోతు కాలువల తీసి నీరుని బయటికి తీసివేసి భూమిలో అధిక తేమ లేకుండా చూసుకోవాలన్నారు.

'భగీరథ'.. కలుషిత కథ

- తరచూ పైప్‌లైన్లకు లీకేజీలు
- కలుషితమవుతున్న నీరు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు



సదాశివనగర్‌లో భగీరథ కుళాయిల ద్వారా వస్తున్న కలుషిత నీరు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించి ఫ్లోరైడ్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నీరు ప్రజల పాలిట శాపంగా మారుతోంది. భగీరథ నీటిలోనే పుష్కలమైన లవణాలు ఉంటాయని, ఆ నీటినే తాగాలని, ఎలాంటి రోగాలు దరి చేరవని గ్రిడ్ అధికారులు ఇటీవల గ్రామ గ్రామాన అవగాహన సదస్సులు నిర్వహించారు. దీంతో చాలా గ్రామాల్లో ప్రజలు భగీరథ నీటికి అలవాటు పడ్డారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా క్షేత్రస్థాయిలో కలుషిత నీరు గ్రామాలకు సరఫరా అవుతోంది. గ్రామాలను సందర్శించాల్సిన గ్రిడ్ అధికారులు పట్టించుకోక పోవడంతోనే నీరు కలుషితం అవుతోందని వారు పేర్కొంటున్నారు. మర్కల్ మల్లన్నగుట్ట వద్ద నీటిని శుద్ధి చేసే విధానం ఉన్నప్పటికి ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న భగీరథ పథకం పైప్‌లైన్లకు తరచూ లీకేజీలు ఏర్పడుతుండడంతో భారీ ఎత్తున నీరు వృథా అవుతోంది. దీంతో కలుషితమైన నీరే గ్రామాలకు సరఫరా అవుతోంది. నీరు బెల్లం రంగులో సరఫరా కావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం...రోగాలు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మండలంలోని 24 జీపీల పరిధిలో రక్షిత మంచినీటి ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణ లేకపోవడంతో భగీరథ ప్లాంట్ నుంచి ఎలాంటి నీరు వస్తుందనే విషయాన్ని పాలకవర్గాలు పరిశీలించడం లేదు. ఉదయం కుళాయిలకు సరఫరా చేసే నీరు కలుషితంగా వస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు. కలుషిత నీరు వస్తుందనే విషయాన్ని వాటర్‌మెన్‌లు, గ్రిడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు.

పరిశీలిస్తాం

గ్రామాలకు కలుషితమైన నీరు సరఫరా అవుతున్న విషయం మా దృష్టికి రాలేదు. గ్రామాలను సందర్శించి ఎక్కడైన లీకేజీలుంటే పరిశీలిస్తాం. కలుషిత నీరు సరఫరా కాకుండా దృష్టి సారిస్తాం. గ్రామాల పరిధిలోనే లీకేజీలు ఉంటేనే నీరు రంగు మారుతాయే తప్ప ప్లాంట్ వద్ద ఎలాంటి తప్పిదం ఉండదు. వచ్చిన నీటిని శుద్ధి చేసిన తర్వాతనే గ్రామాలకు సరఫరా చేస్తున్నాం.

– శ్రీధర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలి



అక్కంపల్లిలో టీకాలు వేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

సాక్షి నెట్‌వర్క్ : పశువులకు గాలికుంటు వ్యాధులు రాకుండా ఉండేందుకు పాడి రైతులు టీకాలు వేయించాలని పశువైద్యాధికారులు సూచించారు. శుక్రవారం జిల్లాలో పలు చోట్ల పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఎల్లారెడ్డి మండలంలోని జంగమాయిపల్లిలో సర్పంచ్ రజిత నాగిరెడ్డిపేట మండలంలోని అక్కంపల్లిలో ఎంపీపీ రాజ్ దాస్, జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి పశువైద్య సిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేశారు. కామారెడ్డి మండలం శాబ్దిపూర్, శాబ్దిపూర్ తండాల్లోని పశువైద్యాధికారి రవి కిరణ్, లింగంపేట మండలం భవానిపేటలో పశువైద్యాధికారి రవికుమార్‌లు టీకాలు వేసి శిబిరాలను ప్రారంభించారు. పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఈవీఎం పనితీరుపై అవగాహన



భిక్కనూరులో అవగాహన కల్పిస్తున్న ఎన్నికల అధికారి రాజు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బొల్లారంలో శుక్రవారం అధికారులు ఈవీఎం ద్వారా గ్రామస్తులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈవీఎంపై ఓటు వేసే విధానాన్ని అధికారులు వారికి వివరించారు. అనంతరం గ్రామస్తులు ఈవీఎం పనితీరును పరిశీలించారు. ఎల్లారెడ్డి ఎంపీవో ప్రకాష్, ఉపసర్పంచ్ ధర్మవీర్, పంచాయతీ కార్యదర్శి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలకేంద్రంతో పాటు సిద్ధరామేశ్వరనగర్‌లో ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి రాజు మాట్లాడుతూ.. ఈవీఎంలతో సమయం ఆదా అవడంతో పాటు ఫలితాలను కూడా తొందరగా వెలువడించే అవకాశం ఉంటుందన్నారు. ఈవీఎంల గురించి వివరించి వారితో ఓటు వేసే ప్రక్రియను చేయించారు.

సీఎం కేసీఆర్ నిర్ణయం హర్షణీయం



బిచ్కుందలో పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

బిచ్కుంద/భిక్కనూరు/రామారెడ్డి : పంట రుణ మాఫీపై సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ శుక్రవారం కూడా జిల్లాలో పలు చోట్ల ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు రైతులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. బాణ సంచా కాల్చి ఆనందం వెలిబుచ్చారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని నేతలు కొనియాడారు. ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు.

డబ్బా పాలు వద్దు.. తల్లి పాలు ముద్దు



సదాశివనగర్: మోడెగాంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత

సాక్షి నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడి కేంద్రాలలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ.. డబ్బా పాలు వద్దు తల్లి పాలు ముద్దు అని వ్యాఖ్యానించారు. తల్లి పాలు అన్నింటి కంటే శ్రేయస్కరమని, పుట్టిన బిడ్డకు గంటలోపు కచ్చితంగా తల్లి పాలు తాగించాలని అన్నారు. ఆరు నెలల వరకు తప్పకుండా తల్లి పాలే తాగించాలని సూచించారు.



రాజంపేటలో ..



జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో..

ఫ్లెక్సీలను తొలగించాలని వినతి



బాన్సువాడ: పట్టణంలో పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం సీఐ మహేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేష్ మాట్లాడుతూ.. బాన్సువాడ అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు పది రోజులైనా ఇప్పటి వరకు తొలగించలేదని, వెంటనే ఫ్లెక్సీలను తొలగించాలని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు ఖలేక్, మధుసూదన్‌రెడ్డి, గుడాల నగేష్, గొల్ల వెంకన్న, కొట్టం గంగాధర్, రమేష్, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

ఎంపీటీసీ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): అన్నారం ఎంపీటీసీ ఉమాదేవి చేస్తున్న డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ కోరారు. ఎల్లారెడ్డి పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో 9 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎంపీటీసీ ఉమాదేవికి శుక్రవారం ఆయన మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెన్న లక్ష్మణ్, ఆరిఫ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): తిమ్మారెడ్డి గ్రామంలో పలువురు యువకులు పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. వారికి మదన్‌మోహన్, కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాయితీ లంబాడాల సంఘం మండల యూత్ కమిటీ ఎన్నిక



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో శుక్రవారం కాయితీ లంబాడాల మండల యూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బామాన్ రాజేందర్, ఉపాధ్యక్షులుగా నరేష్, గంగాసింగ్, ప్రధాన కార్యదర్శిగా బచ్చన్, కార్యదర్శిగా జేతిలాల్, కోశాధికారిగా బామాన్ చందర్, సలహాదారులుగా బర్దావల్ గోపాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాయతి లంబాడాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ఎల్లారెడ్డి ఆర్డీవో రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు



కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డికి..



మద్నూర్‌లో..

సాక్షి నెట్‌వర్క్ : విద్యాశాఖ సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండు చేస్తూ శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్డీవోలు, తహసీల్దార్లకు వారు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో 22,000 మంది సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో 13 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో వివిధ వింగ్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. తమను ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఉద్యోగిని రెగ్యులరైజ్ చేయడానికి అని అర్హతలున్నాయన్నారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు ఆందోళనలు చేపడతామన్నారు. ఈ నెల 7న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

వెంటనే జీతాలు పెంచాలి



మద్నూర్‌లో రాస్తారోకో చేస్తున్న జీపీ కార్మికులు

మద్నూర్(జుక్కల్): పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం వెంటనే జీతాలు పెంచాలని కోరుతు గ్రామ పంచాయతీ సిబ్బంది, కారోబార్‌లు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం రాస్తారోకో, ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. పంచాయతీ కార్మికులకు నెలనెలా జీతాలు చెల్లించడంతో పాటు కనీస వేతనం ఇవ్వాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సురేష్ గొండ కార్మికులకు మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయం వద్ద కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కన కార్మికులు నిర్వ హించిన సమ్మె శుక్రవారం 30వ రోజుకు చేరింది. ప్రభుత్వం తమ డిమాండ్‌లను నెరవేర్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు శివానందంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వీపర్ల దీక్షలు



కామారెడ్డి రూరల్: కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట పార్ట్‌టైం స్వీపర్లు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 40వ రోజుకు చేరుకుంది. దీక్షల్లో పాల్గొన్న లింగంపేట మండలం ఐలాపూర్ పాఠశాలకు చెందిన షేక్ మహబూబ్ ఈ నెల 17న మనోవేదనకు గురైమృతి చెందాడని, అలాగే మద్నూర్ మండలం మొగా పాఠశాలలో పనిచేస్తున్న మారుతి ఈనెల 3న తమకు ఇక వేతనాలు పెంచరనే మనోవేదనతో మృతి చెందాడని స్వీపర్లు పేర్కొన్నారు. వారిద్దరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం, ఎస్‌కే హుస్సేన్‌లు మాట్లాడుతూ.. స్వీపర్లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎంపీపీ, ఎస్సైలకు సన్మానం



సన్మానిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

కామారెడ్డి రూరల్: విదేశీ పర్యటన ముగించుకొని కామారెడ్డికి తిరిగి వచ్చిన ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు శుక్రవారం తిరిగి అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయనను ఘనంగా సన్మానించి స్వదేశాగమన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన ఎస్సై రాజును ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు ఆధ్వర్యంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, సర్పంచ్‌లు రవితేజగౌడ్, సాగర్‌గౌడ్, ద్యాప హన్మాండ్లు, జ్ఞానేశ్వర్, కో–ఆప్షన్ సభ్యుడు ఫజల్, సింగిల్ విండో వైస్ చైర్మన్ శంకర్‌గౌడ్, నాయకులు నారాయణరెడ్డి, బాలయ్య, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట ఎస్సైకి..

రాజంపేట: రాజంపేట ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సంపత్‌ను శుక్రవారం మండల సీపీఐ నాయకులు సన్మానించారు. శాలువాతో సత్కరించారు. నాయకులు బత్తుల ఈశ్వర్, చాకలి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్‌కు ..

భిక్కనూరు : పెద్దమల్లారెడ్డిలోని కో–ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన బస్వాపూర్ రాజిరెడ్డిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. సింగిల్‌విండో చైర్మన్ రాజాగౌడ్, డైరెక్టర్లు సురం కిష్టయ్య, యాదగిరి, బాపురెడ్డి పాల్గొన్నారు.

తాడ్వాయి తహసీల్దార్‌గా సునీత

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి తహసీల్దార్‌గా సునీత శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. మాచారెడ్డి తహసీల్దార్‌గా పనిచేసిన సునిత బదిలీపై తాడ్వాయికి వచ్చారు. ఈ సందర్భంగా రేషన్‌షాపు డీలర్లు, రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. రేషన్‌షాపు డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరిశెట్టి రాజు, జిల్లా కార్యవర్గసభ్యుడు సంతోష్‌రావు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు జీపీఎఫ్ బకాయిలపై నిరసన



బాన్సువాడ/సదాశివనగర్: జీపీఎఫ్ బకాయిలను విడుదల చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు కామారెడ్డి జిల్లా పరిషత్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.సత్యనారాయణ, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల లింగం తెలిపారు. శుక్రవారం బాన్సువాడ సీయూపీఎస్ పాఠశాలలో ఆయన మాట్లాడారు. టీపీటీఎఫ్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం చేపట్టే నిరసన కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలి రావాలని కోరారు. టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కరెల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

మండల సభ వాయిదా

మాచారెడ్డి: సరైన కోరం లేక మాచారెడ్డి మండల సర్వ సభ్య సమావేశాన్ని వాయిదా వేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన మండల సభను తాత్కాలికంగా కోరం కోసం 12 గంటల వరకు వాయిదా వేశారు. అయినా సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో బాలకృష్ణ తెలిపారు.

7న చలో తిరుపతి



కామారెడ్డి అర్బన్: ఈనెల 7న తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ మైదానంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించే అఖిల భారత జాతీయ ఓబీసీ 8వ మహాసభకు బీసీలందరూ తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు పిలుపునిచ్చారు. శుక్రవారం కామారెడ్డి ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఓబీసీ జాతీయ మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ జనాభా పరంగా 60 శాతం ఉన్న బీసీల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అన్నారు. ఓబీసీలకు జరుగుతున్న అన్యాయంపై గళం వినిపించే తిరుపతి మహాసభకు బీసీలందరు తరలిరావాలన్నారు.

సంక్షిప్తం

చలో కోరుట్ల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని పద్మశాలి సంఘం భవనంలో శుక్రవారం పద్మశాలి సంఘం నాయకులు చలో కోరుట్ల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 13న ఆదివారం నిర్వహించే పద్మశాలి సంఘం నాయకుల చలో కోరుట్ల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. నాయకులు దశరథం, పండరి, ప్రభు, తదితరులున్నారు.

సరస్వతి మంత్ర జపం

కామారెడ్డి అర్బన్: శ్రీరామ జపలిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి శుక్రవారం స్థానిక ఓరియంటల్ పాఠశాలలో విద్యార్థులతో సరస్వతి మంత్ర జపం చేయించారు. ప్రతిరోజు సరస్వతి మంత్రం జపించడం ద్వారా చదువులో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందుతుందని పేర్కొన్నారు. శ్రీరామ కోటి జపలిఖిత కార్డులను విద్యార్థులకు అందజేశారు.

'స.హ. చట్టం అమలుపై సమీక్షించండి'

కామారెడ్డి అర్బన్: సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ప్రతినిధులు శుక్రవారం కామారెడ్డి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.ప్రసాద్‌ను కలిసి పోలీసు స్టేషన్లలో స.హ చట్టం అమలుపై సమీక్షించాలని కోరారు. పోలీసు స్టేషన్ నుంచి కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్, చార్జిషీట్ జిరాక్స్ పత్రాలు ఉచితంగా పొందవచ్చనే విషయం చాలామందికి తెలియదని స.హ ప్రతినిధులు పేర్కొన్నారు. స.హ చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, ప్రతినిధులు ఎస్. ప్రదీప్‌కుమార్, లింబయ్య, తదితరులు పాల్గొన్నారు.

బోరు బావి తవ్వకం

మాచారెడ్డి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం బోరు బావిని ఎంపీటీసీ సభ్యురాలు రావుల వినోద తవ్వించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు పూజ నిర్వహించి ప్రారంభించారు. ఎంపీడీవో బాలక్రిష్ణ, నాయకులు ప్రభాకర్ ఉన్నారు.

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు శబరిమాత ప్రతిమ, దివ్య సమాధిని అందంగా అలంకరించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

స్పీకర్‌ను కలిసిన మున్సిపల్ కౌన్సిలర్లు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు, పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం హైద్రాబాద్‌లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి పనులు, సమస్యల గురించి వివరించారు.

మినీ బృహత్ పల్లెప్రకృతి వనం ఏర్పాటు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్‌లో శుక్రవారం నూతనంగా మినీబృహత్ పల్లెప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ గంగామణి గ్రామస్తులతో కలిసి మొక్కలను నాటారు. సుమారు 4 ఎకరాల స్థలంలో 5 వేల మొక్కలను నాటించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఉపసర్పంచ్ అంజయ్య, కార్యదర్శి బాల్‌రాజ్ పాల్గొన్నారు.

కాచాపూర్‌లో కొనసాగుతున్న దీక్షలు

భిక్కనూరు: కాచాపూర్‌లో ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేసే వ్యర్థాల నుంచి కాపాడాలంటూ వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు గురువారం నాటికి 102వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దీక్ష శిబిరంలో కూర్చుని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.